




Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com








ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 599 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 29 శనివారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం




## ఆర్థిక కేంద్రంగా

# అమరావతి

- రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం అందిస్తోన్న సాయం ఎనలేనిది
- బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలతో ఆర్థిక వృద్ధి
- ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్ద పీట
- అమరావతిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 28 :
రాష్ట్ర పురోగతి కోసం వేస్తున్న ప్రతి అడుగులో దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదని, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రం అందిస్తోన్న ప్రోత్సాహం ఎంతో విలువైనదని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కేంద్రం నుంచి వస్తున్న ఆర్థిక సాయం కాగితాల లెక్కల్లో కరిగిపోకుండా, జరుగుతున్న అభివృద్ధి ప్రతి ఒక్కరికీ కనబడేలా జవాబుదారీతనంతో మా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అమరావతిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలు నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.




3

## పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో

# చుక్కెదురు

-ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
-అరెస్ట్‌పై గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కూడా ఎత్తివేత
-లొంగిపోయేందుకు సమయం కోరిన నిందితుల తరపు న్యాయవాది

3









## అమరావతి రెండో దశ భూ సమీకరణకు

# ఏపీ కేబినెట్ ఆమోదం

-ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల సేకరణకు నిర్ణయం

-ప్రభుత్వ భూమితో కలిపి మొత్తం 20 వేల ఎకరాలు సమీకరించాలని లక్ష్యం

3



# పంచాయితీ ఎన్నికలపై సిఎం ఫోకస్

## -1నుంచి రేవంత్ జిల్లాల పర్యటన

హైదరాబాద్,నవంబర్28( : పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో సిఎం మరోమారు జిల్లాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రచారం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఇలావుంటి. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న నల్గొండ జిల్లా అదేవరకొండలో పర్యటించనున్నారు.తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17న ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.



# మరుగవుతున్న గుంటూరు!

## ఆంధ్రా అంటే పగ, ప్రతీకారాలే కాదు... ఇవి కూడా!

"ఇప్పుడంటే ఆంధ్ర రాష్ట్రం కక్షలు, కార్పణ్యాలతో రగులుతోంది కానీ, ఒకప్పుడు అక్కడి ఊరు %-% వాడలు సాంస్కృతిక వికాసోద్యమాలకు ఆలవాలం. ఇంకా చరిత్ర లోతుల్లోకి వెళితే... ఆంధ్రావని పట్టణాలు, మరీ ముఖ్యంగా గుంటూరు వీధులన్నీ జాతీయోద్యమ స్ఫూర్తిని కళ్ళకు కడతాయి. బ్రాడీపేట శంకర్ విలాస్ మీదగా మాల్పూరి, ముంతమసాలా బండ్ల వరసను దాటి రెండవ లైన్‌లోకి అడుగు పెట్టగానే గతకాలం ఆనవాళ్లు కొన్ని పలకరిస్తాయి. మరికాస్త ముందుకెళితే, రోడ్డుమీద రాజ ఠీవితో వందేళ్ల వైభవోపేత చరితను సింగారించుకున్న వనితా స్ఫూర్తి మహల్ ఒకటి తారసపడుతుంది. అదే తెలుగు మహిళా చైతన్య కేతనం.. మహాత్ముడు మెచ్చిన 'శారదా నికేతనం'. ఆ లోగిలి సింహద్వారం వద్ద నిలబడి, శతవసంతాల ప్రాంగణం వైపు తేరిపార చూస్తే, గొప్ప భవితకు దారిచూసే ఘనమైన కాలం జాడలు సాక్షాత్కరిస్తాయి. అవి కులాల సంకుచితత్వానికి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి."

**వందేళ్ళ కిందటి మాట...**

పదేళ్లలోపు బాలికలకు పెళ్లిళ్లు చేయడం సంప్రదాయం.

భర్తను కోల్పోయిన అమ్మాయిలకు సైతం రవికెలు తీసేయించి గుండు కొట్టించడం ఆచారం. ఇలాంటి అంధ విశ్వాసాలు, కట్టుబాట్ల పేరుతో సమాజం ఆవలకు నెట్టేసిన వ్యధితులను అమ్మలా అక్కున చేర్చుకొని, వారికొక వెలుగు దారి చూపిన మహోన్నత మానవతామూర్తి ఉన్నవ లక్ష్మీబాయమ్మ. ఆడవాళ్ళ జీవితాల్లోని చీకట్లను చీల్చేశక్తి చదువుకే సొంతమని వందేళ్ళ కిందటే ఆమె నమ్మారు. బాధితురాళ్ళకు బాసటగా ఓ ఆశ్రమం అవసరమని ఆనాడే గుర్తించారు. అలా 1922, నవంబరు 22న గుంటూరులో ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు 'శారదా నికేతనం' నెలకొల్పారు. పదిమందితో మొదలైన ఈ గురుకులానిది సాంఘిక సంస్కరణోద్యమ చరిత్రలో సువర్ణాధ్యాయం. తెలుగు గడ్డపై దీనిదొక మహోజ్వల ప్రస్థానం. ఆ స్మృతుల పుటలో మనసుకు మంగళ స్నానం చేయించే మానవీయ ఘటనలు కోకొల్లలు.!

కుల,మత అంతరాలు శారదా నికేతనానికి ఆమడ దూరం. ఆవరణలో తరతమ భేదాలుండవు.! ధనిక, పేదా తేడాలుండవు. వారిదంతా అరమరికలెరుగని ఒకటే కుటుంబం. రోజూ సాయంత్రాలు నికేతనంలోని అమ్మాయిలంతా లక్ష్మీబాయమ్మ చుట్టూ చేరి, ఆ అమ్మకాని అమ్మ చేతి గోరుముద్దలు తింటూ, కథలు చెప్పించుకోవడం శారదా నికేతనంలో వెల్లివిరిసిన ప్రేమతత్వానికి నిదర్శనం. చిట్టి తల్లులకు తలంటడం మొదలు, జడలు అల్లడం వంటి పనులు ఆ అమ్మ నిత్యకృత్యంలో భాగం.

లక్ష్మీబాయమ్మ కడుపున పుట్టింది అర్జునరావే అయినా, ఆమె మాత్రం కొన్నివందల మంది అమ్మాయిలకు అమ్మగా మారారు. మాతృప్రేమకు కొత్త నిర్వచనమయ్యారు. నికేతనంలో అబ్బాయిలకు ప్రవేశం ఉండద్దని, కన్నకొడుకునూ దూరం పెట్టిన మనస్విని ఆమె.! కారణమేదైనా, కన్నవాళ్లు వద్దు అనుకొని వీధుల్లోకి విసిరిన చిట్టి తల్లులను ఒడిలోకి తీసుకున్న విశాల హృదయం ఆనాటి శారదా నికేతనం సొంతం. బ్రాడీపేట శివాలయంలో దొరికిన ఆరువారాల పసికందును గుండెకు హత్తుకొని, కన్నబిడ్డకన్నా మిన్నగా సాకారు లక్ష్మీబాయమ్మ.

న్యాయస్థానానికి సైతం ప్రశ్నార్థకమైన మరొక అనాథను దగ్గరికి తీసిన ఆమె ఔన్నత్యాన్ని వర్ణించడానికి తెలుగు వర్ణమాల సరిపోదేమో.! ఇలా కాత్యాయని, కల్యాణి, చారుశీల, శారద, రాజమ్మ... ఒకరా,ఇద్దరా... నా అన్నవాళ్లెవరూ లేని పదిమందికి అమ్మా, నాన్న లు అయ్యారు ఉన్నవ దంపతులు.! వాళ్ల చదువులు మొదలు, పెళ్లిళ్లు, పురుళ్ళు వంటి బాధ్యతలన్నీ లక్ష్మీబాయమ్మ నిర్వర్తించారని కాత్యాయని జ్ఞాపకాల్లో రాశారు.

అందులోనూ... గుడిమెట్ల మీద దొరికిన తనను సొంతబిడ్డకన్నా ఎక్కువగా ఉన్నవ దంపతులు పెంచిన తీరును చదువుతుంటే, కళ్లు చమర్చకుండా పుట తిప్పడం కష్టమే.!

శారదా నికేతన్ మహోన్నత లక్ష్యానికి మెచ్చిన మునగాల రాజా నాయని వెంకట రంగారావు బ్రాడీపేటలో మూడెకరాల స్థలం విరాళమిచ్చారు. అందులోనే దాతల సహకారంతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. హైదరాబాద్ కి చెందిన ఓ షావుకారు 1930 లలో నికేతనంలో గదుల నిర్మాణానికి విరాళం ఇవ్వడం ఆనాటి ఇరు ప్రాంతాల స్నేహ బంధానికి నిదర్శనం.

నికేతనం ప్రారంభమైన పదేళ్ళలోపే ఆశ్రితుల సంఖ్య వందల్లోకి చేరింది. వారికేలోటు రాకూడదని, లక్ష్మీబాయమ్మే గుర్రపు బండి తోలుతూ, ఇంటింటికి తిరిగి బియ్యం, పప్పులు వంటి నిత్యావసరాలను సేకరించిన రోజులున్నాయి. 'ఏమీ లేకుంటే, కనీసం మజ్జిగలో వేసుకునేందుకు మా పిల్లలకు ఉప్పు అయినా దానమివ్వండి' అంటూ దాతలను అమ్మ అర్థించేవారంటూ శారదా నికేతనం పూర్వ విద్యార్థి కోగంటి వేంకట రంగనాయకి చెబుతారు.

శారదా నికేతనంలో తెలుగు, హిందీ, ఆంగ్ల, సంస్కృత భాషల్లో విద్యా బోధన సాగేది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, భాషా ప్రావీణ్య కోర్సులు, శాస్త్రీయ సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర లలిత కళలు, కుట్లు, అల్లికలు వంటి రకరకాల

వృత్తివిద్యల్లో శిక్షణతో అలరారిన ఆనాటి నికేతన వైభవం అంతా ఇంతానా.!

అక్కడ చదివిన చాలామంది ఇవాల్టికి బోధనా రంగంలో రాణిస్తున్నారు.

పైసా ఖర్చు లేకుండా చదువు అందడంతో పాటు అమ్మాయిల భద్రతకు ఢోకాలేదనే ఉద్దేశంతో మారుమూల పల్లెలు, సుదూర ప్రాంతాల వారెక్కువగా నికేతనంలో చేరేవారు.!

ఘట్‌కేసర్ నుంచి సత్తెమ్మగా అక్కడికెళ్లి,

జాతీయోద్యమ నాయకురాలిగా తిరిగొచ్చిన సంగెం లక్ష్మీబాయమ్మ జీవితమే శారదా నికేతనం ఔచిత్యానికి ప్రతీక.!

భారతీ రంగా, బొందలపాటి శంకుంతలా దేవి వంటి వారెందరో శారదా నికేతనంలో అక్షరాలు దిద్దారు. అక్కడ చదువుతున్న కొమ్మా శకుంతలాదేవిని ప్రేమించి పెళ్లాడారు త్రిపురనేని గోపీచంద్.

స్వాతంత్ర్యోద్యమంలోనూ శారదా నికేతనం విద్యార్థినిల పాత్ర ప్రత్యేకమైంది.

ఉన్నవ నాయకత్వంలో ఉప్పుసత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా పోరాటాల్లో పాల్గొన్న కొందరు నికేతనం అమ్మాయిలు జైలుకెళ్లారు. మరికొందరు లాఠీ దెబ్బలూ తిని వీర వనితలుగా చరితకెక్కారు.

ఆనాడు కోనేటి గట్టున స్వాతంత్ర్యోద్యమ శపథం పట్టిన వందమంది యువకులకు వీరతిలకం దిద్ది... 'వీర గంధం తెచ్చినారము...' గేయం ఆలపిస్తూ, నికేతనం విద్యార్థినిలు హారతి పట్టిన దృశ్యాన్ని కనుపర్తి వరలక్ష్మమ్మ అక్షరీకరించారు.

స్వాతంత్ర్య ఆకాంక్షతో సాగే సభ, ఊరేగింపు, నిరసన ఏదైనా.. అందులో శారదా నికేతనం అమ్మాయిలు ముందుండే వాళ్లంటే అతిశయోక్తి లేదు.

తాగుబోతుల ఆగడాలకు కళ్ళెం వేసేందుకు నికేతనం ఆడపిల్లలు కల్లు దుకాణం వద్ద ఆ రోజుల్లో పహారా కాయడం అంటే మాటలా. వాళ్ళ తెగువకు హ్యాట్సాఫ్.!

జంతువుల కన్నా ముందు తమను బలివ్వమంటూ అమరావతి కొలుపుల్లో నికేతనం అమ్మాయిలు నిరసించడంతో దున్నపోతుల్ని గావు పట్టే దురాచారం అంతటితో ఆగడం విశేషం. ఇలా తెలుగు నాట సంఘసంస్కరణ, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో శారదా నికేతనం ఓ చుక్కాని.




అప్పట్లో శారదా నికేతనం వార్షికోత్సవమంటే కళా ప్రియులకు పండుగే.! అందునా విద్యార్థినిల సంగీత, నాటక ప్రదర్శనలు చూస్తూ, సమయం రాత్రి తొమ్మిది దాటినా ప్రేక్షకులు ఒక్కరూ కదిలేవారు కాదట. ఇదంతా 1950లకు ముందు సంగతి.!

శారదానికేతనాన్ని చాలామంది ప్రముఖులు సందర్శించారు. అందులో మహాత్మా గాంధీ కూడా ఉన్నారు.

1927, ఏప్రిల్ 17న నికేతనంలోని రెల్లుగడ్డి కప్పు కింద కూర్చొని ప్రసంగించిన బాపూజీ 'ఇటువంటి సంస్థ ఆంధ్రదేశంలోనే కాదు యావద్భారతంలోనే లేదని" కితాబిచ్చారు. స్వరాజ్య నిధికోసం దేశమంతా తిరిగి జోలె పట్టిన గాంధీజీ, నికేతనం

అమ్మాయి నూలు వడికే పద్ధతికి మెచ్చి రూ.150 బహూకరించడం మామూలు విషయమా.! మరికొందరు దీన్ని ఆంధ్రా శాంతినికేతనమని కూడా అభివర్ణించారు.

లక్ష్మీబాయమ్మ రోజువారీ జీవితంలో పూజా పునస్కారాలు, నోములు, వ్రతాలు భాగం . అయినా, ఆమె మూఢురాలు కాదు. ఛాందసభావాలకు ఉన్నవ దంపతులు విరుద్ధం.

పదేళ్ళకే వితంతువు అయిన కూతురిని మూఢం అని ఓ కఠినాత్ముడైన తండ్రి నడిరోడ్డుమీద వదిలేస్తే, ఆ సంగతి తెలిసిన లక్ష్మీబాయమ్మ 'నాకు అలాంటి పట్టింపేమీ లేదంటూ'... హుటాహుటిన బయలుదేరి అమ్మాయిని నికేతనానికి తీసుకొచ్చారు. పెంచి, పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పారు. తర్వాత ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఎదిగారు. ఇలా ఒకరా, ఇద్దరా...వితంతువులకు రవికెలు తొడిగి, నుదుట తిలకం దిద్ది సంప్రదాయవాదల నోళ్ళకు తాళం వేశారు లక్ష్మీబాయమ్మ.

నికేతనంలోని నలభైకి పైగా వితంతువులకు ఉన్నవ దంపతుల చేతులమీదగా పునర్వివాహాలు జరిగాయి. వితంతుపునర్వివాహం అంటే ఆనాడు మాటలు కాదు. అవి జరిపినందుకు ఆ దంపతులు ఎదుర్కొన్న సమస్యలు అన్నీఇన్నీకావు. సామాజిక బహిష్కరణకు లోనయ్యారు. సంప్రదాయవాదుల కోపానికి గురయ్యారు. అవన్నీ తటుకొని, కాలానికి ఎదురీదారు. జనుల మదిలో నిలిచారు.

ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందన్న గురుజాడ మాటలకు కార్య రూపమే శారదా నిలయం.

వందేళ్ల చరిత్రలో ఒక శారద, కొన్నివందల మంది శారదలను తీర్చిదిద్దింది.

ప్రశ్నార్థకమైన జీవితాలకు ఇదొక వేగుచుక్క.

మంచంపట్టినా నికేతనం నిర్వహణ బాధ్యతలను మాత్రం లక్ష్మీబాయమ్మ విస్మరించలేదు. తుది శ్వాస వరకు మహిళాభ్యున్నతి కోసమే అమ్మ పరితపించారు. ఆమె తదనంతరం 1955లో శారదా నికేతనం బాధ్యతను దేవాదాయ శాఖకు అప్పగించారు లక్ష్మీనారాయణ పంతులు. తర్వాత కొంతకాలం వరకూ ఆ స్ఫూర్తి కొనసాగింది.

రానురాను నికేతనాన్ని పట్టించుకునే నాథులే లేకుండా పోయారు. జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి వంటి దయార్ద్ర హృదయులు సంస్థకు ఇచ్చిన భూ విరాళాలను నికేతనం నిర్వహణ కోసం నలభై ఏళ్ళ కిందటే పాలకులు అమ్మేశారు. తర్వాత అంతా గడ్డు పరిస్థితే. తరగతి గదులు వంటి కనీస వసతులు లేక విద్యార్థినిలు అష్టకష్టాలనెదుర్కొన్నారు. నడపలేక చాలా కోర్సులు తీసేశారు. నాలుగు వందల మంది విద్యార్థినిలకు రెండే మూత్రశాలలు, తాటాకుల కప్పు లో వంటశాల ...

ఒకనాడు శోభాయమానంగా వెలిగిన సంస్థ దుస్థితి ఇదీ.! అని పదేళ్ళ కిందట ఆంధ్రజ్యోతి ఎలుగెత్తింది. ఆ కథనం చాలామందిని కదిలించింది.

బొమ్మిడాల కృష్ణమూర్తి, క్రేన్ వక్కపొడి యాజమాన్యం తదితర స్థానిక వ్యాపారులతో పాటు తమ్మారెడ్డి భరద్వాజ, త్రిపురనేని సాయిచంద్ వంటి సినీ

ప్రముఖులు స్పందించారు.

నికేతనంలో కొత్త భవనాలతో పాటు కొన్ని మౌలిక వసతులను సమకూర్చారు.

ప్రస్తుతం శారదా నికేతన్ ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లనుంది. మరి.! కొండలను సైతం పిండి చేస్తున్న భూదాహార్తుల ధాటికి గుంటూరు నడిబొడ్డున మూడు ఎకరాల్లో నెలవైన శతాబ్ది సంస్థ భవిష్యత్తు ఏమిటనేది చాలా మంది సందేహం.!

చివరిగా బీ

ఆంధ్రా అంటే రెండు కులాల మధ్య సాగే అధికార పోరు కాదు. పాలకుల బూతుమాటలు, క్యాసినో ఆటలు అస్సలే కాదు. ఆంధ్రా అంటే సంఘసంస్కరణోద్యమం మొదలు కులనిర్మూలనోద్యమం, హేతువాద, నాస్తికవాద, కమ్యూనిస్టు ఉద్యమాలకు ఇలాకా.! మహిళా అభ్యుదయంతో ముడిపడిన జాతీయోద్యమ స్ఫూర్తి గడ్డ. ఆ మహోజ్వల గతం నిండా బోలెడుమంది త్యాగాలే.! ఇప్పుడు మనం వినాల్సింది, చూడాల్సింది ఆ వైభవోపేత గతం తాలూకు జ్ఞాపకాలను.

అత్యంత శక్తిమంతమైన ప్రగతికర ఉద్యమాల చరిత్ర ఆంధ్రా ముంగిలి ముందు రాశులుగా పోసుంది. దాన్ని దోసిటతో పట్టుకోగలిగిన మనసే ఇప్పుడు ఆంధ్రులకు కావాల్సింది.

సేకరణ

# ఆర్థిక కేంద్రంగా అమరావతి






ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు నారా లోకేష్, పొంగూరు నారాయణ, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ, ఎల్ఐసీ లాంటి 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలు ఒకేసారి, ఒకే చోట కొలువుదీరనుండటం చాలా అరుదు.

**-ఆర్థిక కేంద్రంగా అమరావతి అవతరిస్తుంది**

నేడు పునాది వేసిన బ్యాంకింగ్ స్ట్రీట్... అమరావతి నగరానికి ఆర్థిక శక్తినిచ్చే అతిపెద్ద అడుగు. ప్రధాన బ్యాంకుల కార్యాలయాలు, ఆర్థిక సంస్థలు ఒకే చోట కొలువుదీరడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు, వ్యాపార లావాదేవీలు వేగం పుంజుకుంటాయి. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతుంది. ఆ విశ్వాసం అమరావతిని ఆర్థిక కేంద్రంగా నిలబెడుతుంది. ఈ ఆర్థిక సంస్థల ఏర్పాటు ద్వారా రాజధానికి రూ.1,328 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు సుమారు 6,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మాటకు కట్టుబడి 34,915 ఎకరాల భూములు రాష్ట్ర భవిష్యత్తు కోసం ఇచ్చిన రైతుల నమ్మకమే అమరావతికి నగరానికి పునాది. నేడు పునాది వేసింది కేవలం భవనాలకు కాదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తుకు పడిన పునాది ఇది. అమరావతి ఒక ఆర్థిక కేంద్ర%శీ%, విద్యా కేంద్రం, ఒక పరిశోధన కేంద్రం, ఒక మంచి పరిపాలనా కేంద్రంగా ఎదగడానికి నేటి పునాది ఎంతో బలం చేకూరుస్తుంది.

**-కేంద్రం అండతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు**

రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకు వెళ్లడానికి కేంద్రం ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోంది. ఎన్నో ప్రధాన ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో విశాఖలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు రూ.2లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటి ద్వారా దాదాపు 7.5లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కేంద్రం అండతోనే అమరావతి పునర్నిర్మాణ పనులు రూ.1.7 లక్షల కోట్లతో ప్రారంభమయ్యాయి. కర్నూలులో జరిగిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి రూ.13,429 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా కొప్పర్తి - ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ల ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.11వేల కోట్ల ఆర్థిక సహాయ ప్యాకేజీకి కేంద్రం ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరానికి రూ.12,500 కోట్లు, అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఆర్థిక సాయాన్ని సమకూర్చింది. రాష్ట్రంపై ప్రత్యేక అభిమానంతో నిధులు కేటాయిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

# ఈ ప్రయాణం ఇక ఎవరూ ఆపలేరు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, నాబార్డ్ వంటి దిగ్గజ సంస్థల రాకతో అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ శరవేగంగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. ఈ సంస్థల ద్వారా ప్రత్యక్షంగా 6,556 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ సంస్థలన్నీ తమ ప్రధాన కార్యాలయాలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో, అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో నిర్మించాలని ఆయన కోరారు.రాజధాని నిర్మాణం కోసం 34 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులకు ఈ సందర్భంగా చంద్రబాబు శిరస్సు వంచి నమస్కరించారు. ప్రపంచంలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన ల్యాండ్ పూలింగ్ విధానంలో భూ సమీకరణ జరిగిన ఏకైక ప్రాంతం అమరావతి అని కొనియాడారు. రాజధాని పునర్నిర్మాణ పనుల కోసం కేంద్రం రూ.15 వేల కోట్లను కేటాయించిందని గుర్తుచేశారు. "దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గాడిలో పెట్టారు. వారి సహకారంతో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ నిలబెడుతున్నాం. ఇంకా ఇబ్బందులు ఉన్నా, అభివృద్ధి సాధించగలమన్న విశ్వాసం మాకుంది" అని అన్నారు.అమరావతికి కేవలం ఆర్థిక సంస్థలే కాకుండా ప్రపంచస్థాయి విద్యా, వైజ్ఞానిక సంస్థలు కూడా తరలివస్తున్నాయని చంద్రబాబు తెలిపారు. విట్, ఎస్ఆర్ఎం వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కోసం క్వాంటం వ్యాలీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ఆధ్వర్యంలో కాస్మోస్ ప్లానెటోరియం కూడా ఏర్పాటు కానుండటం శుభపరిణామమన్నారు. త్వరలోనే సీడ్ యాక్సెస్ రహదారిని పూర్తి చేస్తామని, 7 జాతీయ రహదారులు, రైల్వే లైన్లతో అమరావతిని అనుసంధానిస్తామని చెప్పారు. అమరావతిని పూర్తిస్థాయి గ్రీన్, బ్లూ సిటీగా తీర్చిదిద్ది, భారతదేశం గర్వపడే రాజధానిగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధిపైనా ఆయన కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు పారిపోయాయని, అయితే కూటమి ప్రభుత్వంపై భరోసాతో ఏపీకి మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయని, అందులో భాగంగానే గూగుల్ సంస్థ రూ.1.37 లక్షల కోట్ల పెట్టుబడితో విశాఖకు వస్తోందని వెల్లడించారు.
మరోవైపు, గోదావరి, కృష్ణా నదుల నుంచి సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు అనుసంధానించి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు పూర్వోదయ పథకం కింద ఉదారంగా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, కేంద్ర సహకారంతో ఏపీ త్వరలోనే నిలదొక్కుకుని దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు

# ఏపీకి ప్రధాని మోదీ పూర్తి సహకారం ఉంటుంది

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభం కావడం సంతోషకరమని, ఇది ఒక యజ్ఞం లాంటిదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలో ఒక కొత్త రాజధాని నగరాన్ని నిర్మించడం సామాన్య విషయం కాదని, ఈ బృహత్కార్యానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో 15 ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగించారు.భవిష్యత్ రాజధానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలు (పీఎస్‌యూ) తమ ప్రధాన కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఒకేచోట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 15 బ్యాంకులు, బీమా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులను ఎన్నటికీ మర్చిపోకూడదని, వారి ప్రయోజనాలను కాపాడటం బ్యాంకుల బాధ్యత అని గుర్తుచేశారు. బ్యాంకులు కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్, ప్యాకింగ్, కోల్డ్ చెయిన్ వంటి సౌకర్యాలు కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమలోని 9 జిల్లాల నుంచి ఉద్యాన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలించడానికి బ్యాంకులు సహకరించాలని పిలుపునిచ్చారు.దేశంలో గత పదేళ్లలో 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటకు తీసుకువచ్చామని, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు కూడా పెరుగుతున్నాయని నిర్మల వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా బ్యాంకులు భవిష్యత్ ఆలోచనలతో, సమీకృత ఐడియాలతో పనిచేయాలని సూచించారు. గతంలో 'మహిళా సఖి' పేరుతో మహిళలను బీమా ఏజెంట్లుగా మార్చే కార్యక్రమం అద్భుత ఫలితాలు ఇచ్చిందని గుర్తుచేశారు.విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా అండగా నిలవాలని ప్రధాని మోదీ ఎప్పుడూ చెబుతుంటారని, ఏపీ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆయన తక్షణమే ఆమోదం తెలుపుతారని అన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని క్వాంటం వ్యాలీ, ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేవలం ఐటీ మాత్రమే కాకుండా, ఆస్ట్రో ఫిజిక్స్ వంటి రంగాల్లోనూ ఏపీని ముందుకు తీసుకెళ్తున్నామని, ఇందులో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం సంతోషకరమన్నారు.ఆచార్య నాగార్జునుడు వంటి గొప్ప శాస్త్రవేత్తలు నడయాడిన ఈ గడ్డపై, అమరావతిలో ఒక కాస్మోస్ ప్లానెటోరియం నిర్మిస్తుండడం హర్షణీయమని అన్నారు. రానున్న ఏడాదిన్నర కాలంలో ఆంధ్రప్రదేశ్ ఒక ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరంగా రూపుదిద్దుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రేర్ ఎర్త్ మినరల్స్‌పై కీలక నిర్ణయం తీసుకుందని, ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కూడా ఏపీ కృషి చేయాలని నిర్మలా సీతారామన్ కోరారు.

## అమరావతి రెండో దశ భూ సమీకరణకు

# ఏపీ కేబినెట్ ఆమోదం


ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రెండో దశ భూ సమీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇస్తూ మంత్రివర్గం తీర్మానించింది. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించాలన్నా, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ, రైల్వే స్టేషన్ వంటి భారీ మౌలిక సదుపాయాలు నిర్మించాలన్నా భూమి అత్యవసరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారమే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, కేబినెట్ సమావేశంలో రెండో దశ భూ సమీకరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో భూసేకరణ చేపట్టబోయే గ్రామాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి గ్రామాలను అధికారులు ప్రతిపాదించారు. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్య వివరాలపై అధికారులు సమర్పించిన నివేదికలను కేబినెట్ పరిశీలించింది.అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 16,666 ఎకరాలతో పాటు ప్రభుత్వ, అసైన్డ్ భూములను కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే మొదటి విడతలో రైతుల నుంచి సుమారు 34,000 ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. తాజాగా రెండో విడతలో మరో 20,000 ఎకరాలు సేకరించనున్నారు. వీటికి అదనంగా, సుమారు 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సీఆర్డీఏకు అప్పగించనున్నారు. దీంతో రాజధాని నిర్మాణం కోసం మొత్తం దాదాపు 70,000 ఎకరాల భూమి అందుబాటులోకి రానుంది.

రైతులు సహకరించాలి: సీఎం చంద్రబాబు

ఈ నేపథ్యంలోనే గురువారం సచివాలయంలో రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో, రాజధాని అభివృద్ధికి రైతులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. రైతుల సహకారం లేకపోతే అమరావతి కేవలం ఒక మున్సిపాలిటీగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్గత విభేదాలు, అనవసరమైన జేఏసీలతో సమస్యలు సృష్టించవద్దని, ప్రతి చిన్న విషయానికీ సోషల్ మీడియాలో చర్చ చేయొద్దని సున్నితంగా హెచ్చరించారు. రైతులంతా కలిసికట్టుగా ఒకే 'అమరావతి అభివృద్ధి కమిటీ'గా ఏర్పడి రాజధాని నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కేబినెట్ నిర్ణయంతో రెండో విడత ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

# వృత్తి విద్యలో రాణిస్తే బంగారు భవిష్యత్తు

కందుకూరు,
వృత్తి విద్యలు రాణిస్తే విద్యార్థుల బంగారు భవిష్యత్తు ఉంటుందని విద్యుత్ శాఖ లైన్మెన్ ఎస్ శివప్రసాద్ అన్నారు మండలంలోని మాచవరం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ శివప్రసాద్ విద్యుత్ సరఫరా అయ్యే పరికరాల గురించి వివరించారు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ ఎలా సరఫరా అవుతుంది ఎలా వినియోగించుకోవాలనే విషయాలపై మాట్లాడారు నేడు అన్ని రంగాలలో విద్యుత్ చాలా అవసరమని విద్యుత్ని చాలా పొదుపుగా వినియోగించాలని కోరారు విద్యతోపాటు వృత్తి విద్యలో కూడా రాణించాలన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండపి శ్రీనివాసులు వృత్తి విద్యా శిక్షకులు సుల్తాన్ బాషా విద్యుత్ శాఖ షిఫ్ట్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.
విద్యా కోర్సులలో( ఐటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) భాగంగా మాచవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9,10 వ తరగతి విద్యార్థులు మాచవరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు పారిశ్రామిక కేంద్రాల పరిశీలన పరిశీలనలో భాగంగా సందర్శించిన విద్యార్థులు సచివాలయంలో విభాగాలు, ఆన్లైన్ అప్లికేషన్స్ గురించి ఉద్యోగుల సిబ్బంది విధి నిర్వహణ గురించి తెలుసుకున్నారు ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు మాచవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండపి శ్రీనివాసులు ఐటి ఉపాధ్యాయులు షేక్ యాసిన్ వెల్ఫేర్ అసిస్టెంట్ టి జయరావు పాల్గొన్నారు




# భారత్‌కు వస్తున్న పుతిన్...

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారైంది. 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన డిసెంబర్ 4, 5 తేదీల్లో భారతదేశంలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు పుతిన్ భారత్‌కు వస్తున్నారని, ఈ పర్యటన తేదీలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. రష్యా వార్తా సంస్థ క్రెమ్లిన్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది.ఈ పర్యటనలో భాగంగా పుతిన్ ఢిల్లీలో ప్రధాని మోదీతో కీలక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, వాణిజ్యం సహా పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఈ సదస్సు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. రష్యా అధ్యక్షుడు పుతిన్ గౌరవార్థం ప్రత్యేక విందును ఏర్పాటు చేయనున్నారు. ఈ విందుకు ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరవుతారు. ఈ శిఖరాగ్ర సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని, ఇది ఉభయ దేశాల పురోగతికి ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.

# ఉడుపి బీజేపీ సుపరిపాలనకు కర్మభూమి

అనంతరం శ్రీకృష్ణ మఠానికి చేరుకున్న మోదీకి, జగద్గురు శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ స్వాగతం పలికి సత్కరించారు. విద్యార్థులు, సన్యాసులు, పండితులు, వివిధ రంగాల పౌరులతో కలిసి లక్ష మంది ఏకకాలంలో భగవద్గీతను పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని కూడా పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఉడుపి తనకు చాలా ప్రత్యేకమైన ప్రదేశమని అన్నారు. జనసంఘ్, భారతీయ జనతా పార్టీల సుపరిపాలన నమూనాకు ఉడుపి ఒక కర్మభూమి అని అభివర్ణించారు. 1968లోనే ఇక్కడి ప్రజలు జనసంఘ్ తరఫున వీఎస్ ఆచార్యను మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నుకొని సుపరిపాలనకు పునాది వేశారని ఆయన గుర్తు చేసుకున్నారు. పర్యటనలో భాగంగా, కార్యక్రమానికి హాజరైన చిన్నారులు గీసిన చిత్రాలను వారి దగ్గర నుంచి సేకరించాలని ప్రధాని తన భద్రతా సిబ్బందిని కోరడం ప్రత్యేకంగా నిలిచింది.

# పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో వారు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది.పిన్నెల్లి సోదరులు ముందస్తు బెయిల్‌కు అర్హులు కాదని జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో వారి అరెస్ట్‌పై విధించిన మధ్యంతర ఉత్తర్వులను కూడా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో లొంగిపోయేందుకు తమకు కొంత సమయం ఇవ్వాలని పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు.ఈ ఏడాది మే 24న గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఓ వివాహ వేడుకకు హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా ఈ దారుణం జరిగింది. వెల్దుర్తి మండలం బొదిలవీడు వద్ద వీరిని స్కార్పియో వాహనంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావును రాయితో కొట్టి చంపినట్లు పోలీసులు తమ దర్యాప్తులో తేల్చారు.ఇది ప్రమాదం కాదని, హత్యేనని స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, మృతుల బంధువులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురిని నిందితులుగా చేర్చగా, ఏ-6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ-7గా ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఉన్నారు. అరెస్టు భయంతోనే వారు ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, తాజాగా వారి పిటిషన్ తిరస్కరణకు గురైంది.

# నేడే కందుకూరు పట్టణ ప్రజల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

కందుకూరు,
కందుకూరు ప్రజల అభీష్టం మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాకు విలీనం చేసిన సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి కందుకూరు పట్టణ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించబడునని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు తెలిపారు.



# టిడిపిని బలోపేతం చేయండి..

## - రాష్ట్ర కార్యదర్శి భాస్కర్..

వెలిగండ్ల, :
రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోలింగ్ బూతులు వారీగా ఇన్చార్జిలు నియమించడం జరిగిందని శుక్రవారం వెలిగండ్ల మండల పర్యటనలో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు ఇంద్రభూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన రాష్ట్ర పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ శ్రేణులను మండల పరిధిలోని 31 34 38 43 పోలింగ్ బూతులలో పార్టీమెజార్టీ తక్కువగా రావటానికి గల కారణాలపై ఆరా తీయడం జరిగినది. త్వరలో జరగబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీని అందరు కలిసికట్టుగా పనిచేసి మంచి మెజారిటీ తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఐపీఎల్‌లో అమ్మకానికి మరో జట్టు!

**-అమ్మకానికి వచ్చిన ఐపీఎల్ ఫ్రాంచైజీలు -ఆర్సీబీతో పాటు రాజస్థాన్ రాయల్స్ కూడా విక్రయం**
**-ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గొయెంకా ఎక్స్ పోస్ట్‌తో వెలుగులోకి**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వచ్చే సీజన్‌కు ముందు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ అమ్మకానికి సిద్ధమైనట్లు ప్రకటించగా, తాజాగా ఈ జాబితాలోకి రాజస్థాన్ రాయల్స్ కూడా చేరినట్లు తెలుస్తోంది. ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గొయెంకా చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు బలాన్నిచ్చింది."ఒకటి కాదు.. రెండు ఐపీఎల్ జట్లు అమ్మకానికి ఉన్నాయి. అవే ఆర్సీబీ, రాజస్థాన్ రాయల్స్. వీటిని దక్కించుకునేందుకు నలుగురైదుగురు కొనుగోలుదారులు రేసులో ఉన్నారు. పూణె, అహ్మదాబాద్, ముంబయి, బెంగళూరు, యూఎస్ఏ నుంచి కొత్త యజమానులు వస్తారేమో చూడాలి!" అని హర్ష్ గొయెంకా తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారి, క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ జట్టులో రాయల్స్ స్పోర్ట్స్ గ్రూప్‌కు 65 శాతం వాటా ఉంది.ఇదిలా ఉండగా, ఆర్సీబీ యాజమాన్య సంస్థ డియాజియో ఇప్పటికే ఫ్రాంచైజీ విక్రయ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ విషయాన్ని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు కూడా తెలియజేసింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్సీబీని కొనుగోలు చేసేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త అదర్ పూనావాలాతో పాటు మరో రెండు సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో వచ్చే ఐపీఎల్ సీజన్‌లో ఈ రెండు జట్లు కొత్త యాజమాన్యాల చేతికి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.





# స్పిరిట్ షూట్‌లో ప్రభాస్ బిజీ



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది.స్పిరిట్' కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రి కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీనికోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

# భారీ అంచనాల మధ్య 5న వస్తోన్న దురంధర్

బాహుబలి, పుష్ప2 లాంటి భారీ సినిమాల దెబ్బకి బాలీవుడ్ కూడా పూర్తిగా మారిపోయింది. ఇప్పటి దాకా లవ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్స్ తో ఆకట్టుకున్న రణవీర్ సింగ్ కూడా ఇప్పుడు భారీ యాక్షన్ వైపు టర్న్ తీసుకుని,'ధురంధర్'అనే మాస్ యాక్షన్ థ్రిల్లర్ తో వస్తున్నాడు. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ కాంబినేషన్ లో డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది దురంధర్. ట్రూ ఇన్సిడెంట్స్ ఆధారంగా రూపొందించబడిన ఈ సినిమాను 'ఉరి' దర్శకుడు ఆదిత్య ధర్ 250 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కించాడు. ఇప్పటి కే రిలీజ్ అయిన ట్రయిలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది. బి-టౌన్‌లో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ బయోపిక్ అని రూమర్స్ రావడంతో దర్శకుడు క్లారిటీ ఇస్తూ 'మోహిత్ శర్మ త్యాగం గొప్పది కానీ దానికి దురంధర్‌కి సంబంధం లేదు. టైమ్ వచ్చాక ఆయన బయోపిక్‌ను గొప్పగా చేస్తాం అని అన్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమా 3 గంటల 32 నిమిషాల రన్‌టైమ్ తో వస్తోంది. దాంతో దురంధర్ కూడా ఇండియా లాంగెస్ట్ రన్‌టైమ్ మూవీస్ లిస్ట్‌లోకి ఎంటర్ అవుతుంది. పాన్ ఇండియా వేవ్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్, పుష్ప 2, కల్కి, బాహుబలి ఎపిక్ లాంటి సినిమాలు లాంగ్ రన్‌టైమ్ తోనే రిలీజ్ అయ్యాయి. పాన్ వరల్డ్ హైప్ తో వచ్చి ఘన విజయం సాధించాయి కూడా. ఈ నేపథ్యంలో బాలీవుడ్ కూడా ఆ రూట్లో అడుగు వేస్తోందా అనే చర్చ బలంగా వినిపిస్తుంది.




# వారణాసిలో చిన్నప్పటి మహేశ్‌గా దర్శన్

దర్శక దిగ్గజం రాజామౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న భారీ చిత్రం వారణాసి. ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన 'రుద్ర' గ్లిమ్స్ కు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో షూట్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ లో మహేశ్ చిన్నప్పటి సన్నివేశాలు తీస్తున్నారు. అయితే మహేశ్ చిన్నప్పటి రోల్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొడుకు భార్గవ్ నటిస్తున్నాడని రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ విషయమై వారణాసి టీమ్ ను సంప్రదించగా అసలు అటువంటిది ఏమి లేదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్ కొడుకు నటిస్తున్నాడనేది పక్కా ఫేక్ న్యూస్. ఇక్కడే మరో ఆసక్తికర విషయం తెలిసింది. సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు ప్రిన్స్ మహేశ్ బాబు బావ హీరో సుధీర్ బాబు కుమారుడు దర్శన్ నటిస్తున్నాడు. అందుకు సంబంధించి షూట్ కూడా చేస్తున్నారు. సుధీర్ బాబు చిన్న కొడుకు దర్శన్ ఆల్రెడీ అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించాడు. దర్శన్ నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అలాగే హను రాఘవపూడి డైరెక్షన్ లో వస్తున్న ఫౌజీలోను ప్రభాస్ చిన్నప్పటి రోల్ లో దర్శన్ నటించబోతున్నాడు.







# మళ్ళీ "పెళ్లి చేసుకుందాం" అంటున్న విక్టరీ వెంకటేష్!!

**- విక్టరీ వెంకటేష్ జన్మదిన కానుకగా డిసెంబర్ 13న ట్రెండ్ సెట్టింగ్ బ్లాక్ బస్టర్ "పెళ్ళి చేసుకుందాం" రీ-రిలీజ్**
**- సాయిలక్ష్మీ ఫిల్మ్స్ ద్వారా "4కె" లోరెండు తెలుగు రాష్ట్రాల్లో బ్రహ్మాండమైన విడుదల!!**

విక్టరీ వెంకటేష్ నటించగా అసాధారణ విజయం సాధించిన చిత్రాల్లో "పెళ్ళి చేసుకుందాం" ఒకటి. అందం - అభినయాల కలబోత సౌందర్య హీరోయిన్ గా సుప్రసిద్ధ దర్శకులు ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన ఈ ట్రెండ్ సెట్టింగ్ చిత్రాన్ని సి.వెంకట్రాజు - శివరాజు సంయుక్తంగా నిర్మించారు. పోసాని కృష్ణమురళి సంభాషణలు ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని సాయిలక్ష్మీ ఫిలిమ్స్ పతాకంపై వరప్రసాద్ రెండు తెలుగు రాష్ట్రాల్లో 4 కె లో భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు!! ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సంక్రాంతికి వస్తున్నాం" చిత్రంతో తెలుగులో 300 కోట్ల క్లబ్బు ఫౌండర్ హీరోగా చరిత్ర సృష్టించిన వెంకటేష్ బాబు నటించిన ఆణిముత్యాల్లో ఒకటైన "పెళ్ళి చేసుకుందాం" చిత్రాన్ని 4కె రిజల్యూషన్ లో డిసెంబర్ 13న ప్రేక్షకుల ముందుకు ఫ్రెష్ గా తీసుకువచ్చే అవకాశం లభించడం గర్వంగా ఉంది. మన రెండు రాష్ట్రాల్లో ఉన్న విక్టరీ ఫ్యాన్స్ తో పాటు సిసలైన సినీ ప్రేమికులంతా "పెళ్ళి చేసుకుందాం" చిత్రాన్ని ఆదరిస్తారనే నమ్మకం ఉంది. మూడేళ్లపాటు ఈ చిత్రం హక్కుల్ని మేము కలిగి ఉన్నాం అని అన్నారు. లైలా, బ్రహ్మానందం, తనికెళ్ళ భరణి ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : కె.రవీంద్రబాబు, ఎడిటింగ్ : గౌతంరాజు, మ్యూజిక్ : కోటి, నిర్మాతలు: సి.వెంకట్రాజు - శివరాజు, దర్శకత్వం : ముత్యాల సుబ్బయ్య, రీ-రిలీజ్ : వరప్రసాద్ - సాయిలక్ష్మీ ఫిల్మ్స్!!

# "ప్రేమిస్తున్నా" చిత్రం ఇప్పుడు ఆహా ఓటిటిలో స్ట్రీమింగ్ !!!




హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 28 : వరలక్ష్మీ పప్పుల ప్రజెన్స్ లో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లు గా నటించారు.

ప్రేమిస్తున్నా సినిమా నవంబర్ 7న థియేటర్స్ లో విడుదలై మంచి మౌత్ టాక్ ను సొంతం చేసుకుంది. ఇంటెన్స్ లవ్ స్టోరీగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్వచ్ఛమైన ప్రేమకథతో రాబోతున్న ఈ సినిమాలో సాత్విక్ వర్మ, ప్రీతి నేహా పోటీపడి నటించారు. దర్శకుడు భాను ప్రేమిస్తున్నా సినిమాను న్యూ ఏజెడ్ లవ్ స్టోరీగా ఆడియన్స్ కు చూపించారు.

"అన్ కండీషనల్ లవ్ తో తెరకెక్కిన సినిమా ప్రేమిస్తున్నా. ఇప్పటివరకు తెలుగులో అంత అన్ కండీషనల్ లవ్ తో ఏ సినిమా రాలేదు, అద్భుతమైన పాటలు, పర్ఫార్మెన్స్ తో ఈ చిత్రం నవంబర్ 7న థియేటర్స్ లో విడుదల అయ్యింది. చాలా కాలం తరువాత వచ్చిన బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఈ సినిమా. థియేటర్స్ లో మిస్ అయిన ఆడియన్స్ ఈ సినిమాను ఆహా ఓటిటి లో చూడవచ్చు.

ఇదొక మ్యూజికల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పేరు సంపాదించుకుంది, భాస్కర్ శ్యామల ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ అందించారు, అనిల్ కుమార్ అచ్చు గట్ల ఈ సినిమాకు సంభాషణలు రాయడం జరిగింది, ఈ సినిమాకు నిర్వహణ మంత్రి రవికుమార్, ఎడిటర్ శిరీష్ ప్రసాద్.







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com